క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి సాయం చేయాలి

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఉద్యోగి మేకల జనార్దన్ గ్రామాభివృద్ధికి తనవంతు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. గ్రామ పంచాయతీకి రూ.లక్ష విలువైన ఫ్రీజర్ బాక్సు, స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం ఆయన గ్రామానికి వచ్చి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఫ్రీజర్ బాక్సు, ఆర్‌ఓ ప్లాంట్‌ను త్వరలోనే అందజేస్తానని మాటివ్వగా గ్రామస్తులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామాభివృద్ధికి దాతలు సాయం చేయాలని సర్పంచ్ శెట్టి అన్నపూర్ణమ్మ, పంచాయతీ కార్యదర్శి మహేందర్ కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో కుమ్మరుల సంఘం నూతన భవన నిర్మాణం పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రూ.5లక్షల నిధులను మంజూరు చేయడంతో జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్, ఎంపీపీ కళావతి కొండయ్య పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అరుణ రఘుపతిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్, కోఆప్షన్ మదీనా జమీర్, గ్రామస్తులు కుమ్మరి బుగ్గన్న, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

రాజాపూర్: మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం ఎంజేఆర్ యువసేన ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.75 వేల క్రీడాసామగ్రి, యూనిఫామ్‌లు అందజేశారు. వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు న్యూట్రిషన్‌కిట్లు

రాజాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను సర్పంచ్ బచ్చిరెడ్డి, డాక్టర్ మధుసూదన్‌రావ్‌లు అందజేశారు. వైద్యసిబ్బంది, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మహమ్మదాబాద్: జర్నలిస్టులకు స్థలాలు కేటాయించి డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించాలని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి మంగళవారం టియుడబ్ల్యూజే143 అధ్యక్షుడు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ పదిహేను రోజుల్లో స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. స్థలాలను సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించడంతో పాటు స్థానిక నాయకులకు సైతం త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని సూచించారు. నాగరాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

బెంచీల వితరణ

జడ్చర్ల టౌన్: పట్టణంలో జీఎల్‌ఎం ప్రభుత్వ బాలికల కళాశాలలో వాసవీ, వనిత, క్లాస్‌మేట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ గవర్నర్ మేడిశెట్టి రామకృష్ణ, క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు ప్రవీణ్, ప్రిన్సిపాల్ నసియా ఫాతిమాలు పాల్గొన్నారు.

22న అమరవీరుల దినోత్సవం

మిడ్జిల్: ఈ నెల 22న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమర వీరుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సుదర్శన్, ఎంపీడీఓ సాయిలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చౌరస్తాలో అమరులకు నివాళి అర్పించి మౌనం పాటించనున్నట్లు వివరించారు.

304 దరఖాస్తులు

జడ్చర్ల: ప్రభుత్వం కులవృత్తులకు ప్రకటించిన రూ.లక్ష సాయానికి సంబంధించి మున్సిపాలిటీ పరిధిలో 304 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగిసిందని పేర్కొన్నారు. తమకు వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓకు ఉత్తమ అవార్డు

నవాబుపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన విద్యాదినోత్సవం కార్యక్రమ నేపథ్యంలో మండల ఇన్‌చార్జ్ రాజునాయక్‌కు ఉత్తమ అవార్డు లభించింది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. మండల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు రాజునాయక్‌ను అభినందించారు.

నేడు ఉల్లి వేలం

దేవరకద్ర: వివిధ గ్రామాల నుంచి రైతులు తెచ్చిన ఉల్లి బహిరంగ వేలం దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ధరలు నిర్ణయిస్తారు. స్థానిక వ్యాపారులతో పాటు ఇతరులు కూడా వేలంలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. మంగళవారం మార్కెట్‌లో ఎలాంటి లావాదేవీలు జరగలేదు. ప్రస్తుతం సీజన్ లేక పోవడం వల్ల మార్కెట్‌కు ధాన్యం రావడం లేదు.



దేశాయ్‌పల్లి వేడుకల్లో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



ఏనుగొండ అనాథ శరణాలయంలో



సిద్ధోటంలో..



వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో పుస్తకాల పంపిణీ

విద్యారంగానికి పెద్ద పీట



జడ్చర్లలో విద్యాదినోత్సవంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి,తదితరులు

జడ్చర్ల: ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానికంగా నిర్వహించిన విద్యా దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో సరైన విద్యా సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటు తరువాత విద్యారంగంలో మార్పులు తీసుకువచ్చారని అన్నారు. 2014 తరువాత నియోజకవర్గంలో 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై రూ.1.20 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. జిల్లా కేంద్రంలో వైద్య విద్య కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత తమదేన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆలరించాయి. జెడ్పీ వైస్ చైర్మన్‌యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి కల్లేపల్లిలో రూ.18 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షల చెక్కులను అందజేశారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి, సర్పంచ్ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మన ఊరు మన బడి దేశానికే ఆదర్శప్రాయమని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యాదినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని దేశాయిపల్లిలో వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిజిటల్ క్లాసురూంలు, సైన్స్‌ల్యాబ్, బాత్‌రూంలను ప్రారంభించారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఈశ్వరయ్య గౌడ్, హెచ్‌ఎం తిమ్మారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని విద్యా దినోత్సవాలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గండేడ్: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండలంలోని నసురుల్లాబాద్ జెడ్పీహైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ ప్రారంభించారు. స్నేహఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 లెనోవా కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు దేవ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ భీమయ్య, స్నేహ ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలో విద్యాదినోత్సవం కార్యక్రమాల్లో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, రైతు బంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, వైస్ ఎంపీపీ సంతోష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీపీ సుదర్శన్, హెచ్‌ఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు: జిల్లా కేంద్రంలోని ఏనుగొండ అనాథ శరణాలయంలో మంగళవారం విద్యా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి అందజేశారు. బదిర ఉపాధ్యాయులను సన్మానించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, జగపతి రావు, డాక్టర్ విష్ణు జనార్దన్, పాల్గొన్నారు.

పీయూలో సైన్స్ ఎగ్జిబిషన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈమేరకు సైన్స్, ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అభినందించారు.



మూసాపేట మండలం తుంకినీపూర్‌లో..



మిడ్జిల్‌లో..



నసురుల్లాబాద్ జెడ్పీహైస్కూల్‌లో..

ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్య..

భూత్పూర్: సీఎం కేసీఆర్ ముందు చూపుతో ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఉన్నత పాఠశాలలో జెడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు పుస్తకాలను అదేవిధంగా ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి సొంత ఖర్చులతో అందిస్తున్న నోటు పుస్తకాలను అందజేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు రూ.80 కోట్లతో వసతులు కల్పించామని వివరించారు. 4ఏళ్లుగా ఉచితంగా నోటు పుస్తకాలను అందజేస్తున్న ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డిని అభినందించారు. తహసీల్దార్ చెన్నకిష్టన్న, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గూరకొండలో రూ. 72 లక్షలతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, ఎంపీడీఓ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి బండ్రపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో రూ. 34లక్షలతో అదనపు భవనాన్ని ప్రారంభించారు. ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన భూసన్న మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డిలు వేర్వురుగా పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. భూసన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్థిక సాయం అందజేశారు.

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన రిజ్వాన్ ఇటీవల కుక్క కాటుకు గురై హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. బాలుడిని జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ శ్రీకాంత్, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి గ్రామస్తులు ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నవాబుపేట: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీలత తెలిపారు. మంగళవారం ఆమె మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎంపీపీ అనంతయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు.

ఓన్‌ప్లేట్ వాహనాలను తొలగించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : జిల్లాలో ఉన్న ఎంపీడీఓలు పెట్టుకున్న ఓన్‌ప్లేట్ వాహనాలను వెంటనే తొలగించాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హేర్ వేహికిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌డీఓ యాదయ్యకు వినతి పత్రం సమర్పించారు. సొంత వాహనాలు పెట్టుకుని బిల్లులు క్లెయిమ్ చేసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో నిరుద్యోగులమైన తమ లాంటి వారు ఉపాధి కోల్పోవాల్సి వస్తోందన్నారు. ఎంపీడీఓలు ఈజీఎస్‌లో వాహనాలు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఉన్న వాహనాలకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. వాహనాలు తొలగించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లును విడుదల చేయించినందుకు డీఆర్‌డీఓ యాదయ్యను నాయకులు సన్మానించారు. విజయ్‌కుమార్, మల్‌రెడ్డి, శివరామకృష్ణ, రవి పాల్గొన్నారు.

అభివృద్ధిపై అవగాహన కల్పించాలి

చిన్నచింతకుంట: బీజేపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిపై కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో యోగా దినోత్సవం, జనసంఘ్ వ్యవస్థాపకుడు శాంప్రసాద్ ముఖర్జీ దివస్ ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు దశరథ్, అసెంబ్లీ కన్వీనర్ కుర్వరమేష్, నాయకులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవాబుపేట: లోకిరేవు శివారు నుంచి నవాబుపేటకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం మంగళవారం తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా చౌటపల్లికి చెందిన మల్లేష్‌గౌడ్ ఇసుక తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. మండలకేంద్రం సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. నిందితుడిపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైద్యసేవలు అందించాలి

జడ్చర్ల: బాదేపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం నుంచి వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. ఆస్పత్రిని మంగళవారం సందర్శించారు. గంగాపూర్ రహదారి సమీపంలో వంద పడకల ఆస్పత్రిలో సేవలు కొనసాగించడంతో ఇక్కడి ప్రాంత ప్రజలకు అందుబాటులో లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇక్కడ కూడా ఓపీ సేవలు అందించాలని ఆయన సూచించారు. అదేవిధంగా వంద పడకల ఆస్పత్రిలో అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, డాక్టర్ శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

బాలానగర్: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఘటనపై బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వివాహిత..

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన వివాహిత తిరిగి రాలేదు. వన్‌టౌన్ ఎస్ఐ జగన్నాథం కథనం ప్రకారం..జిల్లా కేంద్రంలోని పాత పాలమూరుకు చెందిన అంకిత స్థానిక ఎంవీఎస్ కళాశాలలో పీజీ చదువుతోంది. ఈనెల 19న ఉదయం కళాశాలకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లిన ఆమె సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో భర్తతో పాటు ఇతర కుటుంబ సభ్యులు గాలించిన ఆచూకీ లభించలేదు. భర్త చిన్నా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంత్రికి దూప, దీపనైవేద్య అర్చకుల కృతజ్ఞతలు

స్టేషన్ మహబూబ్‌నగర్: దూప, దీపనైవేద్య అర్చకుల వేతనాన్ని రూ.6వేల నుంచి రూ.10వేల వరకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంపై జిల్లా సంఘం ప్రతినిధులు మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా 113 పోస్టులు భర్తీ చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరన్న, రవి, కోశాధికారి మహేష్, రామలింగం , కుమారస్వామి పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు



అడ్డాకులలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అడ్డాకుల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఇళ్ల పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా దోమల నివారణకు కృషి చేయాలని ప్రచారం చేశారు. మూసాపేట మండలం జానంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కూడా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు శరత్‌చంద్ర, షబానాబేగం, సీహెచ్‌ఓలు భాస్కర్, జైపాల్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నవాబుపేట: మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో ప్రజలకు వ్యాధిపై పూర్తిగా అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నవీన్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మలేరియా మాసోత్సవాలను ప్రారంభించి ప్రసంగించారు. సిబ్బంది శ్రీనువాస్, శకుంతల, రాఘవేందర్, శరబలింగం, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: ఇళ్లలో ఎక్కువ రోజులు నీటి నిల్వ ఉంచకుండా చూడాలని మండల వైద్యాధికారి డా.అబ్దుల్ రబ్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఒండ్రుమట్టి తరలింపు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా చెరువులోని ఒండ్రుమట్టిని యథేచ్ఛగా తరలించడం పై రైతులు, మత్స్యకారులు, అటు ఇటుక వ్యాపారుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. చెరువులో ఒండ్రుమట్టిని తరలించాలంటే నీటిపారుదల, మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు తప్పనిసరి. అయితే ఇందుకు భిన్నంగా ఎలాంటి అనుమతి లేకుండా అడ్డగోలుగా సోమరాయుని చెరువులో ఒండ్రుమట్టిని తరలించడంపై గాజులపేట గ్రామానికి చెందిన రైతులు, మత్స్యకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తరలించేది లేదని తేల్చి చెప్పడంతో సర్పంచ్ చంద్రశేఖర్ చెరువు వద్దకు చేరుకుని రైతులు, ఇటుక వ్యాపారులతో చర్చించారు. సర్పంచ్ సైతం ఇటుక వ్యాపారులకు అనుకూలంగా మాట్లాడారని రైతులు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మట్టిని తరలిస్తే తమ ఉపాధి పోతుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ ఆసీఫ్‌ను వివరణ కోరగా అనుమతులు ఇవ్వలేదని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాకర్లపహాడ్ గ్రిడ్ వద్ద విద్యుత్ అంతరాయం



కాకర్లపహాడ్ గ్రిడ్ వద్ద తెగిన విద్యుత్ వైర్లు

నవాబుపేట: కాకర్లపహాడ్ సమీపంలో ఉన్న మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద విద్యుత్ సమస్య తలెత్తింది. దీంతో వివిధ గ్రామాలకు నీటి సరఫరా నిలిచింది. ఈ గ్రిడ్ ద్వారా 88 గ్రామాలకు నీటి సరఫరా ఉంటుంది. తాజాగా మంగళవారం గ్రిడ్‌లో ఉన్న 11 కేవీ విద్యుత్ సరఫరా చెంత జంపర్లు కట్ కావటంతో నడుస్తున్న మోటార్లు ఆగిపోయాయి. కాగా త్వరగా పూర్తి చేసి వెంటనే నీటి సరఫరా చేయాలని మండల అధికారులు విద్యుత్ సిబ్బందికి ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీలత వెంటనే పనులు పూర్తిచేయాలన్నారు. గ్రిడ్ వద్ద నిర్లక్ష్యం వహించరాదని అధికారులు హెచ్చరించారు.

దొమ్మరులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మహమ్మదాబాద్: దొమ్మర కులం వారిని ఎస్సీ జాబితాలో చేర్పించాలని రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు దొమ్మరి వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం నంచర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్ని జిల్లాల్లో దొమ్మరులు ఎస్సీ జాబితాలో ఉండగా కేవలం గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో మాత్రం బీసీ 'ఏ'జాబితాలో ఉన్నట్లు వివరించారు. మార్చాలని పలుమార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సెక్రటరీ నారాయణ, వెంకటయ్య, శ్రీనివాసులు, లక్ష్మణ్, సుంకన్న, పోషయ్య, ఖాసీం, ముత్తయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్

డ్రమ్ సీడర్‌తో నాట్లు వేసుకుంటే మేలు



మాచన్‌పల్లిలో రైతులకు వరి విత్తనాల ప్యాకెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్త భరత్ భూషణ్

మహబూబ్‌నగర్ రూరల్: వరిలో వెదజల్లి, డ్రమ్ సీడర్ ద్వారా విత్తటం, యంత్రంతో నాట్లు తదితర పద్ధతులను ఆచరించాలని డాట్ సెంటర్ శాస్త్రవేత్త భరత్ భూషణ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అదనులోనే పైర్లను విత్తాలి, పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను వేయొద్దని అన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉండే పంటలను పండించి లాభాలు పొందాలని అన్నారు. గ్రామాలలో ఎలాంటి విత్తనాలను కొనుగోలు చేయకుండా వ్యవసాయశాఖ అనుమతి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొని తప్పనిసరిగా రశీదు తీసుకుని పంట పూర్తయ్యే వరకు భద్రపరచాలని సూచించారు. అనంతరం వరిలో ఆర్‌డీఆర్ 1162 రకం విత్తనాల బస్తాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఇష్రత్ సుల్తానా, ఏఈఓ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లకు సన్మానం



చైర్మన్, కమిషనర్‌లకు మిఠాయిలు తినిపిస్తున్న వైస్‌చైర్మన్, అధికారులు, సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు మున్సిపాలిటీకి ఏకంగా రెండు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కడంతో మంగళవారం చైర్మన్ కేసీ నర్సింహులు, కమిషనర్ డి.ప్రదీప్ కుమార్‌లను కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిఠాయిలు తినిపించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ తాటి గణేష్ కుమార్, టీపీఓ లక్ష్మీపతి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 16న లక్ష జనాభా కలిగిన చెత్త రహిత పట్టణం కేటగిరీలో, 19న హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎక్కువ మొక్కలు నాటి సంరక్షించినందుకు ఉత్తమ అవార్డులు మున్సిపాలిటీకి దక్కాయి.

వార్షిక బ్రహ్మోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని శ్రీకంచికామకోటి పీఠం పాలమూరుశాఖ వేంకటేశ్వరస్వామి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చండీహోమం ఏర్పాటు చేశారు. ఇరివింటి శ్రవణ్‌కుమార్ శర్మ, వేంకటేశ్వర సేవా మండలి సభ్యులు తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, రాఘవేంద్రశర్మ, గుండా వెంకటేశ్వర్లు, రామలింగం, శ్రీచంద్రశేఖర వేద పాఠశాల గురువు మునీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

మహబూబ్‌నగర్ క్రీడలు: నిరంతరం యోగా చేయడం వల్ల ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందుతారని సుప్రభాత్ హెల్త్‌క్లబ్ కన్వీనర్ జి.పాండురంగం అన్నారు. భారత్ వికాస్ పరిషత్, సుప్రభాత్ హెల్త్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఫసియొద్దీన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, కృష్ణమోహన్, రమేష్‌చందర్ పాల్గొన్నారు.

విద్యాదినోత్సవం సాక్షిగా విద్యార్థులతో వెట్టి

జడ్చర్ల టౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అట్టహాసంగా విద్యాదినోత్సవం నిర్వహించగా పట్టణంలోని ఓ పాఠశాల విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించటం చర్చనీయాంశంగా మారింది. సిగ్నల్‌గడ్డపై ఉన్న ఎయిడెడ్ పాఠశాలలో ప్రార్థనామందిరాన్ని నలుగురు విద్యార్థినులు శుభ్రం చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. బకెట్లలో నీళ్లు తీసుకువెళ్లటం, చీపురు పట్టుకుని ఊడ్చటం, కిటికీలు, డోర్లు శుభ్రం చేయటం వంటివి వీడియోలో కన్పించాయి. పనులు చేయించటంపై విద్యార్థి సంఘాల నాయకులు, పట్టణప్రజలు మండిపడుతున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ పనివారు ఆలస్యం అయినందున గది మాత్రమే శుభ్రం చేయించామని బదులిచ్చారు.